క్లుప్తంగా

మండపేటలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం


మీడియాతో మాట్లాడుతున్న బాబా

మండపేట: రాష్ట్ర ప్రజలు మరోమారు వైఎస్సార్ సీపీకి అధికారాన్ని కట్టబెట్టి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గత ఐదేళ్లు తమకు చేసిన మేలుకు బదులు తీర్చుకోనున్నారని షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా అన్నారు. అదే క్రమంలో మండపేట నియోజకవర్గంలో కూడా వైఎస్సార్ జెండా ఎగరడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. విజయలక్ష్మి నగర్‌లోని వైఎస్సార్ సీపీ ఆఫీసులో బాబా మంగళవారం మీడియాతో మాట్లాడారు. తమ నాయకుడైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలవడం పక్కా అన్నారు.

ఘనంగా పల్లాంబిక అమ్మవారి తీర్థం


చిన కోరుమిల్లిలో విశేష అలంకరణలో పల్లాంబిక అమ్మవారు

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి గ్రామ శివారు చినకోరుమిల్లి గ్రామదేవత పల్లాంబిక అమ్మవారి తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆచారం ప్రకారం పెద్ద కోరుమిల్లిలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో చిన్న కోరుమిల్లిలోని పల్లాంబిక అమ్మవారి ఆలయం వరకూ ఊరేగింపు నిర్వహించారు. ఆడపడుచులు అమ్మవారికి చీర, రవికె సమర్పించారు.

64 మందికి వైద్య పరీక్షలు


వైద్య సేవలందిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: గ్రామ శివారు సత్యనారాయణపురంలో మంగళవారం అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 64 మందికి బీపీ, షుగరు తదితర సాధారణ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ జిత్తుక మల్లికార్జునుడు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి, ఆరోగ్య కార్యకర్త తోటకూర రామకృష్ణ, పి.ఝాన్సీ పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ


వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నప్రసాదం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ ప్రధాన రహదారిలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం 2 వేల మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. స్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా ప్రముఖ దాత సత్తి సుబ్బారెడ్డి ఈ అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, అన్నాయిపేట గ్రామ సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, కమిటీ సభ్యులు ఆకుల కొండబాబు, కాకిలేటి సత్తిబాబు, గుడాల దొరబాబు, గంధం కృష్ణాజీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

మండపేట: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆదేశాల మేరకు రాజీవ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి కొడవళ్ల వెంకట సుబ్బారావు, ముగ్గళ్ల శ్రీను, మగ్గం జాకబ్ రాజబాబు, కొండ దుర్గారావు, కుచ్చు బాబి, వల్లభదాసు చిన్న, పిల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

రామచంద్రపురం రూరల్: యానం నుంచి రెండు సీసాల మద్యం అక్రమంగా తెస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని వేగాయమ్మపేట వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా రాజమహేంద్రవరానికి చెందిన మందా చంద్రలక్ష్మణకుమార్ తన బైక్‌లో రెండు మద్యం సీసాలు తెస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఊరిలోనే 'ఉపాధి'

- ఎన్ఆర్ఈజీఎస్ పనులపై కూలీల ఆసక్తి
- వ్యవసాయ పనులు తగ్గడంతో మొగ్గు
- డిమాండ్ మేరకు పనులు కల్పిస్తున్న సిబ్బంది


ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

రాయవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై కూలీలకు ఆసక్తి పెరిగింది. రబీ పంట ఒబ్బిడి కావడంతో ప్రస్తుతం గ్రామాల్లో పనులు మందగించాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం కల్పించిన ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకుంటున్నారు. క్లస్టర్ పరిధిలో ఈ పథకం ద్వారా పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరుగుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 50 రోజుల్లోనే కూలీల లక్ష్యానికి అనుగుణంగా పనిదినాలు కల్పించేలా అధికారులు కృషి చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో యాక్టివ్‌గా ఉన్న ఉపాధి కూలీలకు 15,71,060 పని దినాలు కల్పించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకూ 11,13,097 పని దినాలు కల్పించాలనేది లక్ష్యం. ఇప్పటి వరకూ 83,660 మంది కూలీలకు 4,95,952 పని దినాలను కల్పించారు.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో ఉపాధి హామీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ చేపట్టిన పనులకు ప్రభుత్వం రూ.19.48 కోట్లు ఖర్చు చేసింది. కూలీలు చేసిన పనికి కొలతల ఆధారంగా వేతనం చెల్లిస్తుంటారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకూ వెచ్చించిన నిధుల్లో వేతనాల కింద రూ.13.67 కోట్లు చెల్లించగా, మెటీరియల్, స్కిల్డ్ వేజెస్ కింద రూ.5.23 కోట్లు చెల్లించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రోజుకు రూ.300 చొప్పున ఉపాధి వేతనం చెల్లించాలి. ప్రస్తుతం కూలీలకు రోజుకు వారు చేసిన పనికి కొలతల ఆధారంగా సుమారు రూ.295 చొప్పున చెల్లిస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో ఉపాధి హామీ పనుల వివరాలు

నియోజకవర్గాలు: రామచంద్రపురం, మండపేట

మండలాలు: రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం.

మొత్తం జాబ్ కార్డుల సంఖ్య:	72,797
కూలీల సంఖ్య:	1,21,724
యాక్టివ్ జాబ్ కార్డుల సంఖ్య:	51,655
యాక్టివ్ కూలీలు:	83,660
ఈ ఏడాది ఇప్పటి వరకూ పనికి వెళ్లిన కుటుంబాలు:	6245
కూలీలు:	9592

ఊపందుకున్న పనులు

ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల నుంచి ఉపాధి పనులు ఊపందుకున్నాయి. సాధారణంగా రబీ సీజన్‌లో కూలీలకు డిమాండ్ ఉంటుంది. అయితే రబీలో యంత్రాల వినియోగం అధికంగా ఉండడంతో కూలీలకు అంతగా పనులు లేక, ఖాళీగానే ఉంటున్నారు. దీంతో వారు ఉపాధి హామీ పథకం వైపు మళ్లుతున్నారు. ప్రతి ఉపాధి కూలీకి పని కల్పించాలన్న ఉద్దేశంతో పని దినాలను పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వేసవిలో పంట కాలవలు శుభ్రం చేయించడం, చెరువుల్లో పూడికతీత వంటి పనులు అధికంగా చేపట్టారు. ఏప్రిల్ నుంచి పనులు చేసే ఉపాధి కూలీల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇప్పటి వరకూ క్లస్టర్ పరిధిలో 51,655 కుటుంబాలు ఈ పథకం ద్వారా పనులకు వస్తుండగా వ్యక్తిగతంగా 83,660 మంది కూలీలు హాజరయ్యారు. కొన్ని కుటుంబాలు వంద రోజుల పనుల లక్ష్యానికి చేరువ అవుతున్నాయి. ఖరీఫ్ పనులు పూర్తి స్థాయిలో మొదలయ్యే వరకూ ఉపాధి హామీ పనులు జోరుగా సాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

కూలీలకు అదనపు సౌకర్యాలు

మండే వేసవి ఎండలకు ఉపాధి కూలీలు వడ దెబ్బ బారిన పడకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం 5.30కు పనులను ప్రారంభించి, ఉదయం 10.30 గంటలకు ముగించుకుంటున్నారు. అయినప్పటికీ ఎండబారిన పడకుండా ఉపాధి కూలీలకు టెంట్లు వేయిస్తున్నారు. అలాగే తాగునీటి సదుపాయం కల్పిస్తుండగా, పలు గ్రామాల్లో దాతల సహకారంతో ఉపాధి కూలీలకు మజ్జిగ కూడా అందిస్తున్నారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా పనులు



ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి 100 పని దినాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల దినసరి వేతనాన్ని రూ.272 నుంచి రూ.300కు పెంచింది. దాంతో కూలీలకు ఉపాధి గిట్టుబాటు అవుతోంది. వేసవిలో ప్రణాళికాబద్ధంగా ప్రతి ఒక్కరికీ పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఆయా గ్రామాల్లో స్థానిక అవసరాల మేరకు ఉపాధి పనులను గుర్తిస్తున్నాం. అధిక మొత్తంలో కూలి వస్తుండడంతో ఉపాధి హామీ పనులు చేసేందుకు కూలీలు కూడా ఆసక్తి చూపుతున్నారు.

– జనిపల్లి సుధారాణి, ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్, రాయవరం

తక్కువ ఖర్చుతోనే పోషకాహారం తయారీ

కాజులూరు: మహిళలు తమకు అందుబాటులో దొరికే మొక్కలు, ఆకుకూరలను ఉపయోగించి తక్కువ ఖర్చుతోనే పోషకాహారం తయారు చేసుకోవచ్చని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తాడి భువనేశ్వరిదేవి అన్నారు. మంగళవారం గ్రామంలో గర్భిణులు, బాలికలకు అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య నియమాలు, పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కొందరు మహిళలు పోషకాహారమంటే ఖరీదుతో కూడుకున్న విషయమని భ్రమపడుతున్నారన్నారు. తక్కువ ఖర్చుతో ఏఏ మొక్కలతో ఏఏ పోషకాహారం తయారు చేసుకోవచ్చో మహిళలకు తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు నల్లమిల్లి విజయలక్ష్మి, నల్లమిల్లి భువనేశ్వరి, దుర్గారాజశేఖర్‌రెడ్డి, అంజి, పలువురు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రపురం: జాతీయ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు మండల న్యాయ సేవాధికార కమిటీ రామచంద్రపురంలో పారా లీగల్ వలంటీర్ల పథకం కింద ఏడాది పాటు పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన వారు మెట్రిక్యులేషన్, లేదా దాని సమానమైన విద్యార్హత కలిగిన 18 ఏళ్లు నిండినవారు పారా లీగల్ వలంటీర్లకు అర్హులని తెలిపారు. జూన్ 20 లోపు మండల న్యాయ సేవాధికార సంస్థ రామచంద్రపురం నందు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

తగలబెడితే సూక్ష్మజీవులు చనిపోతాయి


దంగేరులో తగలబెట్టిన పంట పొలాలు

కె.గంగవరం: మాసూళ్లు పూర్తి చేసిన పంట పొలాల్లోని గడ్డిని తగలబెట్టడం వల్ల భూమిలోని అతి చిన్న ఆరోగ్యకర సూక్ష్మజీవులు చనిపోయి సారవంతం పోతుందని ఏఓ బలుసు రవి రైతులకు సూచించారు. మండలంలోని దంగేరు గ్రామంలో శుక్రవారం వ్యవసాయశాఖ సిబ్బంది పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పొలంలోని మోళ్లు, గడ్డి తగలబెట్టడడం వల్ల కాలుష్యం బాగా పెరిగిపోవడంతో పాటు అగ్ని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. నిప్పు పెట్టడడం వల్ల రైతులకు ఏ ఉపయోగం లేదని పొలంలో సూపర్ పాస్ఫేట్ వేసి దమ్ము చేస్తే దుబ్బులు, గడ్డి బాగా చివికిపోయి భూమిలో కలసి భూసారం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ సహాయకులు శ్రీరామచంద్రమూర్తి, స్థానిక రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సిద్ధం కావాలి


గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచనలిస్తున్న ఏడీఏ రంగారావు, ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు అందరూ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధం కావాలని ఏడీఏ రంగారావు సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో ఆయా గ్రామాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం ఆర్బీకేల్లో ఇండెంట్‌లు తీసుకుని సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ గురించి వివరించాలన్నారు. ఏఓ సత్యప్రసాద్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన కార్యాచరణ రూపొందించుకుని అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఆర్ల అక్కమ్మకు గండ దీపాల సమర్పణ


ఆర్ల అక్కమ్మకు గండ దీపాలు సమర్పిస్తున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురులో కొలువైన ఆర్ల అక్కమ్మవారికి మంగళవారం ఘనంగా తీర్థ మహోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో కనుల విందుగా అలంకరించారు. అమ్మవారిని జిల్లా వ్యాప్తంగా వేలాది భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. అమ్మవారికి గండ దీపాలు, దండుగమ్మ కావళ్లు, కానుకలు, మొక్కులు చెల్లించారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ఆర్ల అక్కమ్మవారు ప్రసిద్ధి కెక్కారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు కానుకలు, మొక్కులు చెల్లించారు.

ఘనంగా పండిత సదస్యం


శ్రీబాలాత్రిపుర సుందర సమేత సోమేశ్వరస్వామివారు

రాయవరం: సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణంలో భాగంగా మంగళవారం పండిత సదస్యం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ అర్చకత్వంలో స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి, దేవేరికి వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

వార్షిక కల్యాణంలో భాగంగా బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు స్వామి వారి రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

చెత్తకుప్పలు తొలగించాలి

కాజులూరు: మండలంలోని తిప్పరాజుపాలెంలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ఏ ఒక్క ప్రాంతంలో డంపింగ్ యార్డ్ సదుపాయం లేకపోవడంతో స్థానికులు గృహవాసాల్లోన్ని చెత్తా చెదారం గ్రామ ముఖద్వారంలోని రోడ్డు పక్కన పారేస్తున్నారు. పశువులు, కుక్కలు, కోళ్ల సంచారంతో రోడ్డు పక్కన పారవేసిన చెత్తకుప్పలు రోడ్లపైకి వస్తున్నాయి. క్రమేపీ రోడ్డుపై చేరిన చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తుందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. దానికి తోడు గ్రామస్తులు కొందరు రాత్రి సమయంలో రహదారులకు ఇరువైపులా బహిర్భూమికి వెళుతుండటంతో రోడ్లు అధ్వానంగా తయారై పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారవుతుందని దీంతో అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త కుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రతి ఇంటా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల గుర్తింపు

కపిలేశ్వరపురం: మండలంలోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల గుర్తింపునకు మంగళవారం ప్రత్యేక సర్వే నిర్వహించారు. కపిలేశ్వరపురం భవిత కేంద్రం ఉద్యోగులు మండలంలోని వాకతిప్ప గ్రామంలో సర్వే నిర్వహించారు. సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల్లోని గణాంకాల ఆధారంగా సర్వే చేశారు. ఒక చిన్నారిని గుర్తించగా దగ్గర్లోని పాఠశాలలో చేర్పించేందుకు సంబంధిత అధికారులకు నివేదించినట్టు కేంద్రం నిర్వాహక తెలిపారు.

మండపేటలో కార్డన్ అండ్ సెర్చ్

- గొల్లపుంత కాలనీలో విస్తృతంగా పోలీసు తనిఖీలు
- రికార్డులు లేని 18 బైక్‌ల స్వాధీనం

మండపేట: అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా పట్టణంలో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించి, సహకరించాలని టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి విజ్ఞప్తి చేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ఇంకా మిగిలి ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు మంగళవారం పట్టణంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఉదయాన్నే గొల్లపుంత రోడ్డులోని వైఎస్సార్ కాలనీలోను, టిడ్కో కాలనీలోను వారు విస్తృతంగా సోదాలు జరిపారు. టౌన్ సీఐ షేక్ అఖిల్ జమ నేతృత్వంలో ఎస్ఐ హరికోటి శాస్త్రి, ఏఎస్ఐలు చిన్నారావు, రంగారావులు బృందాలుగా విడిపోయి సిబ్బందిని వెంట బెట్టుకుని కాలనీ అంతా సోదా చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలతో పాటు, ఆయా ఇంట్లో ఉండే వాహనాలను కూడా తనిఖీ చేశారు. వాహనాలు, మోటార్ సైకిళ్లు ఎవరెవరి పేరున ఉన్నాయో పరిశీలించారు. ఈ తనిఖీల్లో రికార్డులు లేని 18 మోటార్ సైకిళ్లను స్వాధీన పరుచుకున్నట్టు ఎస్ఐ హరికోటి శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆ కాలనీ వాసులకు అయన అవగాహన సదస్సు నిర్వహించారు. కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ శాస్త్రి మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదయ్యే వరకూ ప్రజలంతా తమ ప్రాంతాలకు వచ్చే కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ రెండు వారాలూ పట్టణ మంతా పోలీసు నిఘా ఉంటుందన్నారు. గొడ్డు కాలువను ఆనుకుని ఉన్న ప్లాట్లలో అర్ధరాత్రి వేళ అక్రమంగా సారా, మద్యం విక్రయాలు సాగుతున్నట్టు సమాచారం ఉందని ఎస్ఐ అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చిన్నారావు, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకరరావు, కానిస్టేబుళ్లు కాలనీ వాసులు పాల్గొన్నారు.


వైఎస్సార్ కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

రాయవరం: పల్లెల్లో ఎవరైనా ఘర్షణలకు దిగినా, అల్లర్లకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, కఠిన చర్యలు తప్పవని మండపేట రూరల్ సీఐ కె. శ్రీధర్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని పసలపూడి, రాయవరం, మాచవరం తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన రాయవరం ఎస్సై జి.నరేష్‌తో కలిసి గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడినా, అల్లర్లకు దిగినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల తుది ఫలితాలు వచ్చే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే పెట్రోల్ పోయాలని, సీసాలు, పీపాల్లో పెట్రోల్ కొట్టరాదని పెట్రోల్ బంక్ యజమానులకు నోటీసులు జారీ చేశారు.

టిడ్కో అపార్ట్‌మెంట్స్‌లో..

రామచంద్రపురం: త్వరలో జరిగే జనరల్ ఎలక్షన్స్ ఫలితాల దృష్ట్యా బయట వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతాయని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణ పరిధిలో ఒకటో వార్డు కొత్తూరు టిడ్కో అపార్ట్‌మెంట్స్‌లో ఆకస్మిక తనిఖీలు చేసినట్లు రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు టిడ్కో గృహ సముదాయంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని సీఐ పి.దొరరాజు, ఎస్సై కె.సురేష్‌బాబు పోలీస్ సిబ్బంది నేతృత్వంలో మంగళవారం నిర్వహించారు. జరిగిన తనిఖీల్లో సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 22 బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. సదరు వాహనాల యజమానులను వారి వాహనాలకు సంబంధించిన పత్రాలను తీసుకురావాలని, లేనిచో రికార్డులు లేని మోటారు సైకిళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. టిడ్కో గృహవాసులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి అవగాన కల్పించారు. కొత్తగా ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు బయట నుంచి వచ్చి అపార్టుమెంట్స్‌లో ఉంటే వెంటనే వారి వివరాలను సమాచారం తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.


మాచవరంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ శ్రీధర్‌కుమార్, ఎస్సై నరేష్


రామచంద్రపురం టిడ్కో అపార్ట్‌మెంట్ వాసుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై సురేష్‌బాబు